సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 3 । ఆగస్టు । 2023



సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. - 8లో



యాదాద్రి పునర్నిర్మాణం అద్భుతం

యాదాద్రీశుడి ఆలయ పునర్నిర్మాణం అద్భుతమని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
31°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీసీలకు టికెట్ ఇవ్వాలి

సాక్షి, యాదాద్రి: వచ్చే ఎన్నికల్లో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ బీసీలకు ఇవ్వాలని ఆ పార్టీ బీసీ నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం భువనగిరి ఎల్లమ్మగుడి సమీపంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో ఎలాంటి అవకాశం ఉన్నా బీసీలకే టికెట్ ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో పలువురు బీజేపీ బీసీ నాయకులు పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా పద్మజారాణి

సాక్షి, యాదాద్రి: డీఆర్‌ఓగా పద్మజారాణిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లా ఏటూరు నాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను యాదాద్రి భువనగిరికి బదిలీ చేశారు.

గంట ముందుగానే మధ్యాహ్న భోజనం పెట్టాలి

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నందున గంట ముందుగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డీఈఓ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాత్రలు వేసుకునే ముందు ఆహారం తీసుకోవాల్సి ఉన్నందున మధ్యాహ్నం 12 గంటల లోపు భోజనం పెట్టాలని సూచించారు.

ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి: చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్, ఇంటర్ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ మాధవి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని బీచ్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్ల కో ఆర్డినేటర్లతో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ స్కూల్, ఇంటర్‌పై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 10వ తేదీ వరకు ప్రవేశాలు ఉండగా అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ జగదీష్, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అధికారి కృష్ణారెడ్డి, కో ఆర్డినేటర్లు గడ్డం శ్రీనివాస్, భిక్షమయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి జోసెఫ్

ఆలేరురూరల్: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి జోసెఫ్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్ భాషా విషయాలతో పాటు గణిత బోధనలో ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రవీందర్‌నాయక్, రఘురాంరెడ్డి, దశమంతరెడ్డి, సీఆర్పీలు తిరుపతి, పరుషరాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో సభ్యత్వ నమోదు చేయించాలి

భువనగిరి: రాష్ట్ర రెడ్ క్రాస్ అడ్మినిస్ట్రేషన్ అధికారి జి.కోటిరెడ్డి బుధవారం భువనగిరి పట్టణంలోని రెడ్ క్రాస్ జిల్లా కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో సభ్యత్వ నమోదు చేయించి కమిటీలు వేయాలని, యూత్, జూనియర్ రెడ్ క్రాస్ కమిటీలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీలైనన్ని రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన శిబిరాలు నిర్వహించి రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమంగా నిలిపేందుకు పనిచేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్ రెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు శేక్ హమీద్ పాషా, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి, మోత్కూర్ కమిటీ నాయకులు సత్యానంద్, మంగేష్, యూత్ కమిటీ నాయకులు శివ, నవీన్ తదితరులున్నారు.

ముందస్తు టెండర్!

- మద్యం దుకాణాలకు ముందుగానే టెండర్ల ప్రక్రియ మరూ
- నేడు కలెక్టర్ వద్ద రిజర్వేషన్ల డ్రా
- 4న గెజిట్ విడుదల
- టెండర్లు భారీగా వచ్చే అవకాశం



సాక్షి, యాదాద్రి: వైన్ షాపుల టెండర్లకు ముహూర్తం ఫిక్స్ అయింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల ముందే వైన్ షాపుల టెండర్లకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సిద్ధమైంది. 2023 – 25 సంవత్సరానికి సంబంధించి మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. ఈనెల 4న మద్యం దుకాణాలకు గెజిట్ జారీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 21వ తేదీన లాటరీ పద్ధతిలో జిల్లాలోని 82 దుకాణాలకు కేటాయింపు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న వైన్ షాపులకు నవంబర్ వరకు నిర్వహించుకునే అవకాశం ఉండగా.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో రెండు నెలల ముందే వైన్ షాపుల టెండర్లకు ప్రభుత్వం సిద్ధమైందని తెలుస్తోంది. దీంతో జిల్లాలోని మద్యం వ్యాపారులు టెండర్లలో పాల్గొని మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి సమాయత్తమవుతున్నారు.

సామాజిక వర్గం	రిజర్వు దుకాణాలు
గౌడ్స్	21
ఎస్సీ	07
ఎస్టీ	01
జనరల్	53
మొత్తం	82

నేడు కలెక్టర్ ఎదుట రిజర్వేషన్ లాటరీ

గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలతోపాటు జనరల్ కేటగిరీలో దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన రిజర్వేషన్లు గురువారం కలెక్టర్ నిర్ధారించనున్నారు. ఈ మేరకు రిజర్వేషన్ల జాబితాను ప్రభుత్వానికి పంపించిన వెంటనే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నారు.

21న డ్రా తీసి దుకాణాల కేటాయింపు..

4వ తేదీన మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ కానున్నట్లు సమాచారం. 4వ తేదీ నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు టెండర్ ఫామ్స్ తీసుకుంటారు. 21న డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తారు. 22 వ తేదీ వరకు దరఖాస్తు ఫాం ఫీజు, ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ ఫీజు తీసుకుంటారు. ఇదిలా ఉండగా.. రానున్న ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలకు భారీగా పోటీ పడే అవకాశం ఉంది. ఇప్పటికే మద్యం దుకాణాలను చేజిక్కించుకోవడానికి మద్యం వ్యాపారులు సిద్ధం అవుతున్నారు. ఒక్కో దుకాణానికి భారీగానే టెండర్లు వచ్చే అవకాశం ఉంది.

ఇదీ షెడ్యూల్ :

- 3న రిజర్వేషన్ దుకాణాల డ్రా
- 4న మద్యం దుకాణాలకు గెజిట్ విడుదల
- 4 నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు టెండర్ ఫామ్‌ల స్వీకరణ
- 21న లైసెన్స్‌ల జారీకి డ్రా
- 21, 22 తేదీల్లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లింపు
- నవంబర్ 30న దుకాణాలకు మద్యం సరఫరా
- డిసెంబర్ 1న నూతన మద్యం దుకాణాల ప్రారంభం

జిల్లాలో 82 మద్యం దుకాణాలు

జిల్లాలోని 17 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో నాలుగేళ్ల క్రితం 69 మద్యం దుకాణాలు ఉండేవి. తాజాగా వాటి సంఖ్య 82కు పెరిగింది. ఇందుకోసం ఉన్నతాధికారులకు జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గీత వృత్తిపై ఆధారపడ్డ కుటుంబాలు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను వర్తింపచేశారు. ఇందులో జనరల్ 53, గౌడ్స్ 21, ఎస్సీలు 7, ఎస్టీలకు 1 దుకాణం రిజర్వ్ చేశారు. టెండర్ల ప్రక్రియలో పాల్గొనడానికి ఒక్కో దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా వేసుకోవచ్చు. అయితే ప్రతి దరఖాస్తుకు మాత్రం రూ.2 లక్షలు (తిరిగి చెల్లించబడని ఫీజు) చెల్లించాల్సి ఉంటుంది. అలాగే గతంలో ఉన్న మాదిరిగానే దుకాణం ఎక్సైజ్ టాక్స్‌ల స్లాబ్‌లో ఎలాంటి మార్పు లేదు. కాగా ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర అధికారులకు జిల్లా నుంచి పెంచే దుకాణాలతోపాటు, రిజర్వేషన్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



గుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించి, తమను ఆదుకోవాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణంలో ఆటో కార్మికులు బుధవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆటో కార్మికులు మాట్లాడుతూ 496 రోజులుగా శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వం, దేవస్థానం అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆటోలు నడవక, ఫైనాన్స్ కట్టలేక 70మందికి చెందిన ఆటోలను ఫైనాన్సర్లు లాక్కెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు గడ్డమీద దేవేందర్ గౌడ్, బాకీ మొగిలయ్య, ఎస్కే మన్సూర్ పాషా, ఆవుల సత్తి, వాకిటి కొండలు, కోళ్ల రాజు, నరసింహ, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

వైద్య సేవలు మరింత చేరువ

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: అత్యవసర సమయాల్లో 108, 102 వాహనాలు ప్రజలకు విలువైన వైద్య సేవలు అందిస్తున్నాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. సీఎం కేసీఆర్ ఆలేరు నియోజకవర్గానికి పంపిన 108, 102 వాహనాలను బుధవారం ఆమె యాదగిరిగుట్టలో పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం, తుర్కపల్లి పీహెచ్‌సీలకు, ఆలేరు సీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌లు, అమ్మఒడి 102 వాహనాలు వచ్చాయన్నారు. నూతన వాహనాలతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లిఖార్జున్ రావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి వినోద్, గుట్ట, తుర్కపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు వంశీకృష్ణ, సుధీర్‌రెడ్డి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, 108, 102 వైద్యులు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.



గుట్టలో అంబులెన్స్ ప్రారంభిస్తున్న విప్ గొంగిడి సునీత

ఆల్బెండజోల్‌తో రక్తహీనతకు చెక్

- నేడు 1,72,285 మందికి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 1,878 కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు (ఫైల్)

భువనగిరి: పిల్లల్లో రక్తహీనతను తగ్గించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా గురువారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నారు. గత నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. తిరిగి జిల్లా వ్యాప్తంగా గురువారం మాత్రలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈరోజున మాత్రలు వేసుకోని వారికి ఈనెల 10న పంపిణీ చేయడం జరుగుతుంది. ఈమేరకు జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల 17,285 మందికి 1,878 కేంద్రాల ద్వారా ఆల్బెండజోల్ మాత్రలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మాత్రలు ఇలా వేసుకోవాలి	
వయసు	మాత్ర మోతాదు
1 - 2	200 ఎంజీ మాత్ర
2-3	1 టాబ్లెట్ (400ఎంజీ)
3-19	1 టాబ్లెట్ (400ఎంజీ)

సమకూరనున్న పోషకాలు

పిల్లలు తీసుకునే ఆహారంతో వారి శరీర జీవక్రియలకు అవసరమైన పోషకాలు సమకూరుతాయి. కానీ కడుపులోని పేగుల్లో పరాన్న జీవులుగా ఉండే నులి పురుగులు పిల్లలు తీసుకున్న ఆహారం వారి శరీరాలకు అందకుండా తినేస్తాయి. దీంతో పెరుగుదల కుంటు పడటంతోపాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీంతో పిల్లలో రక్తహీనత సమస్య నియంత్రణే లక్ష్యంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంగా పాటిస్తూ మాత్రలను అందజేస్తున్నారు.

19 ఏళ్ల లోపు వారి వివరాలు	కేంద్రాలు	పిల్లలు
అంగన్‌వాడీ కేంద్రాలు	901	22,257
ప్రభుత్వ పాఠశాలలు	737	63,452
ప్రైవేటు పాఠశాలలు	157	60,427
పాఠశాలలకు వెళ్లని పిల్లలు	-	2,714
ప్రభుత్వ ఇంటర్ కళాశాలలు	29	7,478
ప్రైవేట్ కళాశాలలు	28	7,894
టెక్నికల్ కళాశాలలు	03	536
ఒకేషనల్ కళాశాలలు	02	326
అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్లని పిల్లలు	-	7,201
మొత్తం	1,878	1,72,285

సద్వినియోగం చేసుకోవాలి



"నులిపురుగుల నివారణ కోసం పంపిణీ చేస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలి. గురువారం మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి రోజు మాత్రలు వేసుకోని వారు ఈ నెల 10వ తేదీన తప్పనిసరిగా వేసుకోవాలి.

– డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్ఓ

అవార్డు కోసం అడ్డదారి!

- మున్సిపాలిటీల్లో దారి తప్పుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే
- అభిప్రాయాలను తీసుకోకుండానే ఓటీపీ అడిగి యాప్‌లో నమోదు
- అంతా బాగానే ఉందని సర్వే పూర్తి చేస్తున్న సిబ్బంది

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ చేపట్టింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలకు ర్యాంకులు కేటాయించి, అవార్డులు ప్రకటిస్తోంది. ఈమేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి పలు అంశాలపై అవగాహన కల్పించి వారి అభిప్రాయాలను సేకరించాలి. గత నెల 15న సర్వే ప్రారంభం కాగా.. ఆగస్టు 15 వరకు పూర్తి చేయాల్సి ఉంది. అయితే సర్వే త్వరగా పూర్తి చేయాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచడం, మెరుగైన ర్యాంకుల కోసం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజాభిప్రాయాలను సేకరించకుండానే సర్వే పూర్తి చేస్తున్నారు. కేవలం మొబైల్ నంబర్లు సేకరించి, ఓటీపీ అడిగి సర్వే పూర్తి చేసేస్తున్నారు. దీంతో సర్వే సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన అర్జీదారుడిని సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్పీ

ఎక్కడ పడితే అక్కడ సర్వే

భువనగిరి ఆలేరు, మోత్కూర్, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, పోచంపల్లి మున్సిపాలిటీల్లోని ఆయా ఆటో స్టాండ్లు, బస్టాండ్లు, ఆస్పత్రుల వద్ద సర్వే చేస్తున్నారు. అక్కడ దాదాపు 90 శాతం మంది స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాల నుంచే వస్తుంటారు. వారి ఫోన్ నంబర్ అడిగి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అన్ని బాగున్నాయని ఒకే చేస్తున్నారు. కొందరు ఎందుకు అని ప్రశ్నిస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం అని చెబుతున్నారు. కానీ అందులోని అంశాలను మాత్రం వివరించడం లేదు. భువనగిరి, యాదగిరిగుట్ట బస్టాండ్‌లో మరీ ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఫోన్‌నంబర్లు సేకరించి ఓటీపీ అడుగున్నారు.

అంతా సంతృప్తికరంగానే ఉందని..

సర్వేలో భాగంగా మీ ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరిస్తున్నారా..?, మీ ఇంట్లో తడి, పొడి చెత్తను రోజువారీగా వేరు చేస్తున్నారా?, ఇంటి పరిసరాల్లో మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉన్నాయా?, రెడ్యూస్ రీయూస్ రీసైక్లింగ్ సెంటర్ గురించి మీకు తెలుసా..?, కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారా?, మీ పరిసరాల్లోని పరిశుభ్రతకు మీరు ఇచ్చే రేటింగ్, మీ పట్టణంలో పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారనే అంశాలను ప్రజలకు వివరించాలి. ఇంటి యజమాని ఫోన్‌కు వచ్చే ఓటీపీతోపాటు, అతడి అభిప్రాయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ సర్వే సిబ్బంది ఇవన్నీ చెప్పకుండానే నేరుగా ఓటీపీని అడిగి అంతా సంతృప్తికరంగానే ఉన్నట్లు అప్‌లోడ్ చేస్తున్నారు.

మున్సిపాలిటీ	జనాభా	ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన వారు
భువనగిరి	78,497	20,120
మోత్కూర్	20,920	14,631
యాదగిరిగుట్ట	20,574	10,648
చౌటుప్పల్	41,071	6,847
పోచంపల్లి	22,347	4,177
ఆలేరు	22,491	3,523

తహసీల్దార్ల నియామకం

సాక్షి, యాదాద్రి: ఎన్నికల బదిలీల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లను ఆయా మండలాలకు కేటాయిస్తూ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్క ఆలేరు మండలం మినహా జిల్లాలోని 16 మండలాలకు నూతన తహసీల్దార్లను నియమించారు.

తహసీల్దార్	మండలం
పి.శ్రీనివాస్‌రెడ్డి	యాదగిరిగుట్ట
ఎస్.కిరణ్ మాల్	గుండాల
పి.లాల్‌బహదూర్	రామన్నపేట
జి.దేశ్య	తుర్కపల్లి
శేషగిరిరావు	అడ్డగూడూరు
రాంప్రసాద్	మోత్కూర్
ఎం.కృష్ణ	నారాయణపురం
ఎస్.అంజిరెడ్డి	భువనగిరి
జె.కృష్ణలాల్	ఆత్మకూర్(ఎం)
పి.శ్రీనివాస్‌రావు	బొమ్మలరామారం
బి.శాంతిలాల్	మోటకొండూరు
శోభన్‌బాబు	వలిగొండ
పార్థసింహారెడ్డి	చౌటుప్పల్

తొలిమెట్టుతో గుణాత్మకమైన విద్య

- డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి: తొలిమెట్టు కార్యక్రమంతో విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందుతుందని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని వెన్నెల కళాశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి హీర్యా నాయక్, రిసోర్స్ పర్సన్ రాంచంద్రు, నరేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

భాషపై పట్టు సాధించాలి

బీబీనగర్: గణితం, ఇంగ్లిష్‌పై ఉపాధ్యాయులు పట్టు సాధించాలని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. బీబీనగర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న (ఎఫ్ఎల్ఎన్) మౌలిక భాష గణిత సామర్థ్యాల సాధన శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ డైరెక్టర్ యాదగిరి, ఇన్‌చార్జ్ రాజారెడ్డి, పరిశీలకులు శైలజ, రాజశేఖర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.



బీబీనగర్: మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

బొమ్మలరామారం: మండలంలోని జలాల్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో నిర్దేశించిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, ఎంఈఓ కృష్ణ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌లు నిర్మల జ్యోతి, ఉపేంద్ర, నాగార్జున, సురేష్, షాలిని, ఉపేందర్ రావు, ఆర్పీలు వెంకటేశ్వర్లు, శ్రీదేవి, ఆంజనేయులు, రమేష్, విశ్వరూపం, శ్రీహరి పాల్గొన్నారు.

పద్మశాలీలకు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించాలి

- అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి



సంస్థాన్ నారాయణపురంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంస్థాన్ నారాయణపురం: రాష్ట్రంలో జరగనున్న శాసన సభ ఎన్నికల్లో పద్మశాలీలకు సీట్లు కేటాయించి చట్టసభలో ప్రాతినిధ్యం కల్పించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపాక, సంస్థాన్ నారాయణపురంలో పద్మశాలీల రాజకీయ చైతన్య యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థాన్‌నారాయణపురంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. పుట్టపాకలో చేనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పద్మశాలీల వాటా దక్కించుకునే వరకూ పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, మచ్చ ప్రభాకర్‌రావు, అఖిల భారత పద్మశాలీ రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్ మాట్లాడుతూ 18 నియోజకవర్గాల్లో రాజకీయ చైతన్య యాత్ర కొనసాగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత, రాష్ట్ర పద్మశాలీ మహిళా విభాగం అధ్యక్షురాలు వనం దుష్యంతుల, గుంటక రూప, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, కమర్తపు మురళి, రాష్ట్ర పద్మశాలీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాచర్ల రామచంద్రరావు, రాష్ట్ర రాజకీయ విభాగం అధ్యక్షుడు వాసాల రమేష్, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షులు చిక్క వెంకటేశం, సామల భాస్కర్, సామల విజయలక్ష్మి, గజం పుష్పలత, చంద్రశేఖర్, శ్రవణ్ కుమార్ ఉన్నారు.

రాజకీయ చైతన్య యాత్రకు ఘనస్వాగతం

చౌటుప్పల్: పద్మశాలీ రాజకీయ చైతన్య యాత్ర బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చేరింది. స్థానిక చిన్నకొండూర్ చౌరస్తా వద్ద నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందగట్ల భిక్షపతి, కార్యదర్శి గుర్రం పాండురంగం, జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు, నాయకులు చిక్క నర్సింహ, బడుగు మాణిక్యం, నల్ల నర్సింహ, మాచర్ల కృష్ణ, కోడెం రాములు, గజేందర్, అమర్‌నాథ్, సాయి, శివ ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్: బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరమని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా అన్నారు. ఎయిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతపై వైద్యులు, నర్సులు, ఎంబీబీఎస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు తల్లి పాల ఆవశ్యకతపై చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నీరజ్ అగర్వాల్, వైద్యులు నితిన్‌జాన్, గోవిందు, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మూసీ కత్వపై నూతన వంతెన నిర్మించాలి



వంతెనను పరిశీలిస్తున్న నారాయణరెడ్డి

వలిగొండ: మండలంలోని సంగం వద్ద మూసీ వంతెన దెబ్బతిన్నదని, ప్రభుత్వం వెంటనే నూతన వంతెన నిర్మించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన వంతెనను పరిశీలించి మాట్లాడారు. మండల కేంద్రంలో ఇటీవల బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మైసోల్ల నర్సింహ సతీమణి మంగమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను గూడూరు నారాయణ రెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా సంగంకు చెందిన దుబ్బ శ్రీహరి ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందాడు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాగెల్లి సుధాకర్, బచ్చు శ్రీనివాస్, మైసోల్ల మత్స్యగిరి, గుండా సందీప్, మెదగోని రవీందర్, గోపాల్, నర్సింహ, మహేష్, సుమన్, లింగ స్వామి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో మేథా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 6 నెలల కాలపరిమితి గల ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు ఐటీఐ, లేదా డిప్లమా, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలన్నారు. అలాగే టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజీ, క్విల్ట్ బ్యాగుల తయారీ కోర్సుకు మాత్రం 8వ తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 18నుంచి 25ఏళ్ల లోపు వయస్సు కల్గి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫొటోలతో ఈ నెల 16న సంస్థలో నిర్వహించే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 913390 8222 నంబర్లను సంప్రందించాలన్నారు.

గాయపర్చిన వ్యక్తికి జైలు

నిడమనూరు: ముగ్గురిని గాయపర్చిన కేసులో నిందితుడికి నిడమనూరు కోర్టు జడ్జి స్వప్న నెల రోజుల జైలుశిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. తిరిమలగిరి మండలం చింతల పాలెం గ్రామానికి చెందిన జడల కాశయ్య 2017 జనవరి 22వ తేదీన సాయంత్రం పైలాన్ కాలనీకి చెందిన దేశబోయిన ఉష ఇంట్లో దూరి పని మనిషి ఖదిర్‌ను గాయపర్చాడు. అడ్డు కోబోయిన ఉష నుదిటిపై కత్తితో గాయపర్చి వెళ్తుండగా అడ్డుగావచ్చిన మరో పనిమనిషి స్వర్ణలతను సైతం గాయపర్చి పరారయ్యాడు. కాశయ్య చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన కారణంగా దేశబోయిన ఉష ఇంట్లో ఉంటూ పెరిగి పెద్దవాడు కాగా వివాహం జరిపించారు. వేరేగా ఉంటూ అకారణంగా ముగ్గురిని గార్చాడని విజయపురి(టీ) పోలీస్ స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు ఇవ్వగా అప్పటి ఎస్ఐ గౌరి నాయుడు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని లేదా వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారని కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ మహ్మద్ తెలిపారు.

త్వరలో ఆపరేషన్.. అంతలోనే మృత్యువాత

- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు, బంధువులు
- చౌటుప్పల్ పట్టణంలో విషాదం

చౌటుప్పల్ : కొద్ది రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న యువకుడికి అతి త్వరలోనే ఆపరేషన్ జరగాల్సి ఉంది. కానీ అంతలోనే ఆకస్మికంగా మృత్యువాతపడ్డాడు. ఈ హృదయ విదారకర ఘటన బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌లోని గాంధీపార్కుకు చెందిన బాలగోని నాగేష్(38) స్థానికంగా రిఫ్రిజరేటర్ షాప్ నిర్వహిస్తున్నాడు. నాగేష్‌కు కొద్ది రోజుల క్రితం కిడ్నీ సమస్య తలెత్తింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో


నాగేష్ (ఫైల్)

చికిత్స పొందాడు. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కుమారుడికి కిడ్నీ ఇచ్చేందుకు తల్లి దేవకమ్మ ముందుకు వచ్చింది. అందుకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు సైతం పూర్తయ్యాయి. కిడ్నీ మార్పిడి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కుటుంబ సభ్యులకు నిమ్స్ ఆస్పత్రి వైద్యులు సైతం సూచించారు. అందులో భాగంగా ఈనెల 10 లేదా 12న ఆపరేషన్ నిర్వహించేందుకు వైద్యులు నిర్ణయించారు. ఆ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక నాగేష్‌కు అకస్మాత్తుగా శ్వాస సంబంధిత ఇబ్బంది తలెత్తింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి ఆక్సిజన్ పెట్టారు. అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్ తీసుకువెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతిచెందాడు. త్వరలోనే ఆపరేషన్ జరిగితే సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మారి కలిసిమెలిసి తమ మధ్య తిరుగుతావనుకుంటే కానరాని లోకాలకు వెళ్లిపోయావా అంటూ భార్యాపిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన నిందితుల కారు


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు

- రెండు కార్లలో మహారాష్ట్రకు సరఫరా
- టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు
- అప్పటికే తప్పించుకున్న మరోకారు
- నాలుగు కిలోల గంజాయి, కారు, రూ.15వేల నగదు స్వాధీనం

చౌటుప్పల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సీలేరు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు గంజాయిని రవాణా చేస్తున్న ఇన్నోవా కారును పోలీసులు పట్టుకున్నారు. మరో కారు తప్పించుకొని పోయింది. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద చోటు చేసుకుంది. నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కేసు వివరాలను సీఐ దేవేందర్ బుధవారం వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరిపురం గ్రామానికి చెందిన జావెర్, జాదవ్ అజినాథ్‌తో పాటు అదే జిల్లాకు చెందిన గజిగేట్ ప్రమోద్‌లు వేర్వేరు పనులు చేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో వీరు మిత్రులుగా మారారు. చాలా కాలంగా గంజాయి రవాణా చేస్తున్న జావెర్‌తో కలిసి మిగతా ఇద్దరు కూడా చేతులు కలిపారు. ఆ క్రమంలో సీలేరులోని గంజాయి వ్యాపారుల వద్ద పొడి గంజాయి కొనుగోలు చేశారు. ఒక కారులో 47కిలోలు, మరో కారులో నాలుగు కిలోల చొప్పున ప్యాకెట్‌లుగా చేసి అక్కడి నుంచి బయలుదేరారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రెడ్డిబావి గ్రామ శివారులో తనిఖీలు చేపట్టిన పోలీసులకు ఇన్నోవా కారు చిక్కింది. అందులో నాలుగు కిలోల గంజాయి లభ్యమయ్యింది. అంతకు ముందే 47కిలోల గంజాయి కలిగిన కారు తప్పించుకుపోయింది. ఇన్నోవా కారులో ఉన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు ఫోన్లు, 15వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన సొత్తు విలువ 8లక్షల వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

సూర్యాపేట రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సూర్యాపేట, గరిడేపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన పల్లపు రాజు (25), పస్పుల నాగరాజులు ఇద్దరు కలిసి బైక్‌పై సూర్యాపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. పిల్లలమర్రి స్టేజీ వద్దకు రాగానే సూర్యాపేటలో పని ఉండగా తిరిగి వెళ్లేందుకు పిల్లలమర్రి స్టేజీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజు, నాగరాజుకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజును మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..


ధనుంజయ్(ఫైల్)

గరిడేపల్లి : మిర్యాలగూడకు చెందిన గువ్వ ధనుంజయ్య(53) హుజూర్‌నగర్‌లో ఇరిగేషన్ శాఖ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని హుజూర్‌నగర్ నుంచి తన బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తున్నాడు. గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేట శివారులో కంకర మిల్లు వద్ద చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన కాలపంగు కళ్యాణ్ గరిడేపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తూ ధనుంజయ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనుంజయ్, కళ్యాణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో బంగారు ఆభరణం పోగొట్టుకున్న భక్తుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి బుధవారం వచ్చిన ఓ భక్తుడు తన చేతికున్న బ్రాస్లెట్‌ను ఆలయంలో పోగొట్టుకున్నాడు. కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన లింగమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకునేందుకు సాయంత్రం ఆలయానికి వచ్చాడు. సుమారు సాయంత్రం 5.30గంటల సమయంలో స్వామివారిని దర్శనం చేసుకొని, ముఖ మండపంలో అష్టోత్తర పూజల్లో పాల్గొనేందుకు వెళ్లాడు. అప్పటి వరకు చేతికి ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్ కనిపించలేదు. దీంతో అక్కడే ఉన్న ఆలయ, ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే దర్శనం క్యూలైన్ నిలిపివేసి, దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్‌లోనే ఎస్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేశారు. క్యూలైన్‌లో, ముఖ మండపంలో ఎక్కడ బ్రాస్లెట్ కనిపించకపోవడంతో వెంటనే భక్తుడు లింగమూర్తి, కుటుంబ సభ్యులు కొండపైనే గల కమాండో కంట్రోల్ గది వద్దకు వెళ్లి పోలీసుల సహకారంతో సీసీ ఫుటేజీలో పరిశీలిస్తున్నారు. భక్తుడు ఎస్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ), చండూరు : ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి యువతిని మోసిగించిన యువకుడికి మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చండూరు మండల కస్తాల గ్రామానికి చెందిన ఓ యువతికి తల్లి లేకపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న పెద్దమ్మ పెదనాన్నలు బొమ్మనబోయిన మల్లయ్య, జయమ్మ వద్ద ఉంటూ చదువుకుంటోంది. వీరి ఇంటి పక్కనే ఉంటున్న గంటా శంకర్ మర్రిగూడ మండలం వాయిలపల్లిలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. ఏడాది కాలంగా స్నేహంగా ఉంటూ యువతితో పరిచయం పెంచుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెబుతూ తరచూ వెంట పడ్డాడు. ఇదే క్రమంలో యువతికి సిమ్ కార్డు ఇచ్చి రోజు ఫోన్‌లో మాట్లాతుండేవాడు. కొన్ని రోజుల తర్వాత యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని విషయం శంకర్‌కు తెలిసింది. నన్ను కాదని వేరే వాళ్లని వివాహం చేసుకుంటే నీ అంతు చూస్తానని బెదిరించాడు. 2016 జూలై 11న ఫోన్ చేసి ఇంట్లో ఎవరికి తెలియయుండా పెళ్లి చేసుకుందామని చెప్పి తన వాయినపల్లిలోని అద్దె గదికి తీసుకెళ్లాడు. శారీరకంగా దగ్గరవడానికి ఒత్తిడి చేశాడు. యువతి అంగీకరించకపోవడంతో బెదిరించి లోబర్చుకున్నాడు. రెండు రోజులు గదిలో నిర్బంధించి భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా మానసికంగా చిత్ర హింసలకు గురి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయగా ఇద్దరు కలిసి బైక్‌పై దర్వేశిపురానికి బయలుదేరారు. మార్గ మధ్యలో బైక్ నుంచి కింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయంలో శంకర్ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇద్దరిని ఇంటికి తీసుకెళ్లారు. రెండు రోజుల తర్వాత శంకర్ కుటుంబ సభ్యులంతా యువతిని పెద్దమ్మ ఇంట్లో వదిలేసి వెళ్లిపోయారు. యువతి చండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ పి.రమేష్ కుమార్, ఎస్ఐ సురేష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటమరణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి బి.తిరుపతి అత్యాచారానికి పాల్పడినందుకు సెక్షన్ 376 ప్రకారం పదేళ్ల జైలు రూ. 10 వేల జరిమానా, గదిలో నిర్బంధించినందుకు గాను సెక్షన్ 342 కింద ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

వలపు వల వేసి.. రూ.30లక్షలు కాజేసి..!

- ప్రేమ పేరుతో అమాయకుడిని మోసగించిన యువజంట
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- దంపతుల అరెస్ట్

పాలకవీడు: వ్యసనాలకు బానిసలైన యువ జంట.. ఓ అమాయకుడిని మోసగించి రూ.30 లక్షలు కాజేశారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకవీడు మండలం గూడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సట్టు నారాయణ నేరేడుచర్లకు చెందిన గడ్డం భారతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. నారాయణ క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతుంటాడు. వీరి అవసరాలకు, ఆన్‌లైన్ బెట్టింగులకు డబ్బు అవసరం కావడంతో అదే గ్రామానికి చెందిన దొంగల సతీష్ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసానికి తెరలేపారు. నారాయణ తన భార్య భారతిని సంధ్య అనే పేరుతో సతీష్‌కు పరిచయం చేశాడు. మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో సతీష్ వద్ద నుంచి డబ్బులు కాజేయడం మొదలు పెట్టారు. సతీష్‌ను బెదిరించి నాలుగేళ్లుగా సుమారు రూ.30 లక్షలు కాజేశారు. మోసపోయానని గ్రహించిన సతీష్ పోలీసులను ఆశ్రయంచాడు. జరిగినదంతా పోలీసులకు వివరించి నారాయణ, భరతిలపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు బుధవారం వారిని మిర్యాలగూడ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13వేల నగదు, బైక్ ఇతర సామగ్రి స్వాధీనపరుచుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లింగయ్య తెలిపారు.

సీసీ ఫుటేజీ తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గత నెల 28, 29వ తేదీల సీసీటీవీ ఫుటేజీలను ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అహ్మద్ సేకరించి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ , మందిర అర్చక ప్రముఖ మదన్మోహన్‌లు అన్నారు. సీసీ ఫుటేజీ బయటకు తీసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం యాదగిరిగుట్ట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీ ఫుటేజీ బయటకు వచ్చిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో కర్రె ప్రవీణ్ చామ రవీందర్, కంసాని హరీష్ ఉన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

యాదగిరిగుట్ట: రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట పట్టణ కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 8కోట్ల మంది రవాణా రంగంలో పనిచేస్తున్నారని, అందులో కొంతమంది నిత్యం ప్రమాదాలకు గురవుతూ చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరంలో 1.54లక్షల మంది, గంటకు 17మంది చొప్పున కార్మికులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. ప్రమాదంలో మరణిస్తున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటార్ వాహన చట్టం -2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధంగా ఉందన్నారు. కేంద్ర



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ప్రభుత్వం చట్టాన్ని ఉపసంహరించే వరకు కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యూనియన్ కేంద్ర కమిటీ సభ్యుడు కల్లూరి మల్లేశం అధ్యక్షత వహించిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ , రాష్ట్ర కోశాధికారి సతీష్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు అజయ్ బాబు, రుద్ర కుమార్, కోటయ్య, రాంబాబు, నాయకులు పున్నం రవి, సీహెచ్ రవికుమార్, విజేందర్, యండి పాషా, కువకుమారస్వామి, గోవర్ధన్, రాజమౌళి, నాగరాజు, శ్రీనివాస్, రాములు తదితరులున్నారు.

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


వెంకటయ్య(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: లారీల ఈఎంఐలు చెల్లించలేక, చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ లారీ డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురం మండలం నాగవారిగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. కుంటంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగవారిగూడెం గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య(40) లారీ డ్రైవర్‌గా పనిచూస్తూ హైదారాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. వెంకటయ్య మూడేళ్ల క్రితం మూడు లారీలు కొనుగోలు చేశాడు. లారీలకు కిరాయిలు దొరకవడంతో ఈఎంఐలు కట్టాడానికి సుమారు రూ.15లక్షల వరకు అప్పులు చేశాడు. పెండింగ్ ఈఎంఐలు కట్టడానికి డబ్బులు లేకపోవడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి అడుగుతుండటంతో వెంకటయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం భార్య నవ్యకు లారీ దిగబడింది అని చెప్పి రాత్రి 10:30లకు హైదారాబాద్‌లో ఇంటి నుంచి వెళ్లాడు. బుధవారం నాగవారిగూడెంలోని వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుంటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడికి భార్యతో పాటు బాబు, పాప ఉన్నారు. వెంకటయ్య భార్య నవ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిని బలిగొన్న నీటి సంపు


చిన్నారి సుమిత్ర మృతదేహం

భూదాన్‌పోచంపల్లి : ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ చిన్నారి మృతి చెందింది.ఈ ఘటన భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంబా సింబు కుటుంబం ఉపాధి కోసం నెల రోజుల క్రితం దోతిగూడెం వచ్చారు. స్థానికంగా మోహన్‌రెడ్డికి చెందిన షెడ్‌లో తాత్కాలిక నివాసం ఉంటూ రోజువారీ కూలీ పనులకు వెళ్తుంటారు. బుధవారం సాయంత్రం సింబు కుమార్తె సుమిత్ర (5) ఆరుబయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రులు వెదకగా నీటి సంప్‌లో పడి చనిపోయి ఉంది. వెంటనే మృతదేహాన్ని బయటికి తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోస్ట్‌మార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి

డిండి: ఘర్షణలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిండి మండల పరిధిలోని ధాక్యాతండాకు చెందిన నేనావత్ కృష్ణ(55) ఇంట్లో మంగళవారం సాయంత్రం ఫోన్ చోరీకి గురైంది. తన ఫోన్‌ను అదే తండాకు చెందిన శ్రీను దొంగిలించాడన్న అనుమానంతో కృష్ణ అతడితో గొడవకు దిగాడు. ఇదే క్రమంలో మాటామాటా పెరగగంతో ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో సీసీ రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే రాత్రి అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసామని సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. మృతుడి అంత్యక్రియల సమయంలో తండాలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంజాయి కేసులో నిందితుడిపై పీడీయాక్టు

సూర్యాపేట క్రైం : మహారాష్ట్రకు చెందిన రాబిన్ సన్ ఫెర్నాండీస్‌గంజాయి సరఫరా, రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించారు. నిందితుడు పారిపోతుండగా వెంబడించిన మునగాల పోలీసు సిబ్బంది రాబిన్‌సన్ ఫెర్నాండీస్‌ను అదుపులోకి తీసుకొని 120కేజీల గంజాయిని సీజ్ చేసి అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడు మళ్లీ ఇలాంటి నేరానికి పాల్పడవద్దని ఉద్దేశంతో అతనిపై పీడీ యాక్టు అమలు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. పీడీ యాక్టు నమోదైన నిందితుడిని మునగాల సర్కిల్ సీఐ రాఘవులు ఆధ్వర్యంలో ఎస్ఐ లోకేష్, సిబ్బంది హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌లో అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

బార్‌లో దొంగతనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పరిధిలోని యాదాద్రి బార్‌లో దొంగతనం జరిగింది. బార్ నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి 11గంటల సమయంలో పట్టణంలో నిర్వహిస్తున్న బార్‌ను నిర్వాహకులు మూసి ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి బార్‌ను తిరిగి ఓపెన్ చేయగా కౌంటర్ తీసి, అందులో ఉన్న డబ్బులు దొంగిలించినట్లు కనిపించింది. అనుమానం వచ్చిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చి, బార్‌లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. గతంలో బార్‌లో పని చేసిన ఓ వ్యక్తి దొంగతనం చేసినట్లు నిర్ధారణ అయింది. కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.35వేలకు పైగా నగదును అపహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ రమేష్ తెలిపారు.

ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాల అడ్డగింత

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని గ్రామస్తుల నిర్ణయం

చిట్యాల: విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరుతూ చిట్యాల మండలం ఎలికట్టె గ్రామవాసులు, పలువురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డుగించారు. ఎలికట్టె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 34, ప్రాథమిక పాఠశాలలో 40మందికి పైగా విద్యార్థులున్నారు. దీంతో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి నెలకొనడంతో ఆ గ్రామ సర్పంచ్ ఉయ్యాల సత్తయ్యగౌడ్, ఎంపీటీసీ గొలను గోండ దశరథ ఆధ్వర్యంలో గ్రామస్తులు, ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులంతా గ్రామంలోని విద్యార్థులను తీసుకెళ్లే ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డుకున్నారు. విద్యార్థులందరినీ


ఎలికట్టెలో ప్రైవేట్ పాఠశాల వాహనాలను అడ్డగిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. గురువారం గ్రామస్తులంతా సమావేశమై గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి



ఎలికట్టె గ్రామంలో అన్ని వసతులతో కూడిన జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలున్నాయి. రెండు పాఠశాలల్లో కలిపి ఎనభై మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలోని మరో వంద మందికిపైగా విద్యార్థులు చిట్యాలలోని ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నారు. దీంతో గ్రామంలో అన్ని వసతులున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతే ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. ఇలా జరిగితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పేదరికం కారణంగా విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది.

– గొలనుగొండ దశరథ, ఎంపీటీసీ, ఎలికట్టె

పత్తి పంటలో తెగుళ్లు.. పోషకాల యాజమాన్యం


- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచనలు

పాడి పంట

త్రిపురారం : పంట మార్పిడి చేయకుండా ఏళ్ల తరబడి పత్తి సాగు చేస్తే పంటకు జింకు, మెగ్నీషియం వంటి సూక్ష్మ పోషకాల లోపం కనిపిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా పత్తి పంటలో తెగుళ్ల ఆశించకుండా పోషకాల యాజమాన్య చర్యలు సకాలంలో చేపట్టాలని సూచిస్తున్నారు.

తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు

జింక్ లోపం : జింక్ లోపం సోకిన పత్తి పంటలో మొక్క


సూక్ష్మదాతు లోపంతో పండు ఆకు తెగులు ఆశించి ఎర్రబారిన పత్తి మొక్కలు

ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. ఆకులు చిన్నవిగా ముడతలు పడి కణువుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్కలు గిడసబారిపోతాయి. దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి ప్రతి 5 రోజులకు రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను భూమిలో వేసి కలియదున్నాలి.


డాక్టర్ శ్రీనివాసరావు

పారా నిల్లు లక్షణాలు : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జిల్లాలో అక్కడక్కడ పత్తి పంటలో పారా నిల్లు లక్షణాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. దీని వల్ల మొక్కలకు పోషకాలు సరిగా అందక సడలిపోయి (ఎండిపోయి) చనిపోతున్నాయి. దీని ద్వారా మొక్కలు సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది. దీని నివారణకు అంతర కృషి చేపట్టి మద్దతుగా హెక్టారుకు 25కేజీ యూరియా, పొటాష్ 10 కేజీల చొప్పున అందించి మొక్కలను కాపాడుకోవాలి. పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలి.

మెగ్నీషియం లోపం

మెగ్నీషియం దాతువు లోపంతో ముదురు ఆకుల అంచులు పసుపు రంగుగా మారుతాయి. తరువాత ఆకులు ఎర్రబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి పైరుపై వారం పది రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.